క్లుప్తంగా

పక్కాగా ఎన్నికల కోడ్ అమలు



నెలివాడలో పర్యటిస్తున్న ఎంపీడీఓ హరిహరరావు

బొండపల్లి: ఎన్నికల కోడ్‌ను గ్రామాల్లో పక్కాగా అమలు చేయాల్సిన బాధ్యత సచివాలయ ఉద్యోగులపై ఉందని ఎంపీడీఓ ఎస్. హరిహరరావు అన్నారు. మండలంలోని నెలివాడ గ్రామంలో శనివారం ఉదయం ఆయన పర్యటించారు. గ్రామంలో ఎక్కడైనా రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, బ్యానర్లు, జెండాలు,వాల్‌పోస్టర్లు ఉన్నాయేమోనని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ కార్యాలయ ఏఓ డి.వెంకటరమణ, ఏపీఓ కృష్ణవేణి, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

వాహన తనిఖీలు

దత్తిరాజేరు: ఎన్నికల నేపథ్యంలో మండలంలోని కోమటిపల్లి జాతీయరహదారి -26 వద్ద పోలీసులు, ఎంపీడీఓ కార్యాలయ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద శనివారం ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. చెక్ పోస్ట్ అధికారులు ప్రసాదరావు, నాగేశ్వరరావు ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాల్లో రూ.50 వేలకు మించి నగదు తీసుకువెళ్లినా, అధిక మొత్తంలో వస్తు, సామగ్రిని తరలించినా తగిన రసీదులు, బిల్లులు ఉండాలన్నారు. ఆధారాలు లేకుంటే నగదు, వస్తు, సామగ్రిని స్వాధీనం చేసుకుంటామని, ఎన్నికల కోడ్‌ను పాటించాలని సూచించారు.

ఘనంగా శ్యామలాంబ విగ్రహ ప్రతిష్ఠ

గుర్ల: మండలంలోని కోటగండ్రేడు గ్రామ దేవత శ్యామలాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఆలయ నిర్వాహకులు శనివారం ఘనంగా చేపట్టారు. యాగశాలలో ప్రత్యేక హోమాలు చేపట్టారు. అమ్మవారి విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పూజలు చేశారు.

శాంతియుత ఎన్నికలకు సహకరించండి



భైరిపురంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

మెరకముడిదాం: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అందరూ సహకరించాలని ఎస్సై బి. లోకేశ్వరరావు కోరారు. మండలంలోని గర్భాం, భైరిపురం, బుధరాయవలస గ్రామాల్లో శనివారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో ఎటువంటి గొడవలకు పాల్పడవద్దని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేరండి



ధర్మవరంలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

శృంగవరపుకోట: ఇంటర్మీడియట్ చదవాలనుకుంటున్న పదోతరగతి పూర్తి చేసిన బాలికలు ధర్మవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల/ బాలికల జూనియర్ కళాశాలలో చేరాలని ఆ పాఠశాల ఉపాధ్యాయులు ధర్మవరంలో శనివారం ఇంటింటి ప్రచారం చేశారు. ప్రభుత్వం ప్రత్యేకంగా బాలికల కోసం ధర్మవరంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేసిందని హెచ్ఎం బి.ఉమామహేశ్వరరావు తెలిపారు. అన్ని వసతులు, సౌకర్యాలు ఉన్నాయని, నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యను వినియోగించుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు రహీం షేక్‌లాల్, పి.శివాజీ, ఏ.సురేంద్రనాథ్, టి.రాజేష్, సీహెచ్.కృష్ణంరాజు, జయలక్ష్మి, పి.శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

హోం ఓటింగ్‌కు 4093 మంది గుర్తింపు

బొండపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్ద నుంచే ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఎన్నికల కమిషన్ కల్పించింది. గజపతినగరం నియోజకవర్గంలోని బొండపల్లి, గజపతినగరం, దత్తిరాజేరు,గంట్యాడ మండలాలతో పాటు, జామి మండంలో గజపతినగరం నియోజకవర్గం పరిధిలోకి వచ్చే 13 పంచాయతీల్లో హోం ఓటింగ్‌కు 4093 మందిని గుర్తించామని తహసీల్దార్ ఎస్.హనుమంతురావు శనివారం తెలిపారు. నియోజకవర్గం వ్యాప్తంగా 85 ఏళ్లు దాటిన వారు 3,727 మంది, దివ్యాంగులు 866 మంది ఉన్నట్లు గుర్తించి ఫారం 12–డి అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ ప్రక్రియ కోసం ప్రత్యేక అధికారిగా డిప్యూటీ తహసీల్దార్ పప్పు హరిని నియమించామని చెప్పారు.

వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయం

- ఎన్నికల ప్రచారంలో గజపతినగరం ఎమ్మెల్యే అప్పలనరసయ్య



కెంగువలో ప్రచారం చేస్తున్న గజపతినగరం ఎమ్మెల్యే అభ్యర్థి బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం రూరల్: ఎన్ని పార్టీలు కూటమిగా వచ్చినా రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయమని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని కెంగువ,లోగిశ, పాత శ్రీరంగరాజపురం గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. మహిళలు హారతులుపట్టారు. ప్రచారంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎవరు ఎన్నికుట్రలు పన్నినా ప్రజలంతా జగన్ వైపే ఉన్నారని అన్నారు. సీఎం జగన్ అమలు చేసిన నవరత్నాల పథకాలు పేదల ఆర్థికాభివృద్ధికి దోహదపడ్డా యని అన్నారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అని అన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువ చేశామని, రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు, విత్తనాలు గ్రామాల్లోనే అందించామని చెప్పారు. విద్య, వైద్య రంగాల్లో సీఎం జగన్ విప్లవాత్మక మార్పుల తీసుకువచ్చారని అన్నారు.గత పాలకులతో పోల్చిచూస్తే జగనన్న పాలనలో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని, వేలాది మంది పేదల సొంతింటి కల సాకారమైందన్నారు. నియోజకవర్గంలో ఈ ఐదేళ్లలో అనేక గ్రామాలకు తారు రోడ్లు వేశామని, గ్రామాల్లో సీసీరోడ్లు, సీసీ కాలువలు నిర్మించామని, విద్యుత్ సమస్యలను పరిష్కరించామని వివరించారు. సంక్షేమ, అభివృద్ధి పాలన కొనసాగాలన్నా, సమాజంలో సమానత్వం రావాలన్నా జగన్ ముఖ్యమంత్రిగా కొనసాగాల్సిన అవసరం ఉందన్నారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి గజపతినగరం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను, విజయనగరం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. స్థానిక నాయకులు లెంక గణేష్, సామంతులు పైడిరాజు, జెడ్పీటీసీ గార తవుడు, పార్టీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, మండల నాయకులు మండల సురేష్, బెల్లాన త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.



లోగిశలో ఎమ్మెల్యేకు హారతులు పడుతున్న మహిళలు

వలంటీర్ల రాజీనామా



బొండపల్లి: రాజీనామా పత్రాలను ఎంపీడీఓ హరిహరరావుకు అంజేచేస్తున్న రయింద్రాం గ్రామ వలంటీర్లు

బొండపల్లి/దత్తిరాజేరు: బొండపల్లి మండలంలోని రయింద్రాం, దత్తిరాజేరు మండలంలోని పెదమానాపురం,ఇంగిలాపల్లి గ్రామాలకు చెందిన 9మంది వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో ఎంపీడీఓలు ఎస్.హరిహరరావు, చంద్రకుమారికి తమ రాజీనామా పత్రాలను అందజేశారు. ప్రజలకు నిస్వార్థసేవలు అందిస్తున్న వలంటీర్లపై చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ దుష్ప్రచారం చేయడమే కాకుండా, ఎన్నికల కమిషన్‌కు వారి అనుచరులతో ఫిర్యాదు చేసి, వలంటీర్లను విధులకు దూరం చేశారని, రాజీనామా చేసిన వలంటీర్లు అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిని చేయడం కోసం తామంతా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటామని వారు చెప్పారు.

ఆరుగురిపై బైండోవర్ కేసులు

బొండపల్లి: అక్రమంగా మద్యం విక్రయిస్తూ పలుమార్లు పట్టుబడిన వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామని తహసీల్దార్ ఎస్. హనుమంతురావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎస్ఈబీ ఎస్ఐ ఆర్. రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని పలుగ్రామాలకు చెందిన ఆరుగురు వ్యక్తులపై సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బైండోవర్ కేసులు నమోదు చేశారు. వీరంతా గతంలో పలుమార్లు మద్యం విక్రయిస్తూ పట్టుబడ్డారని, వీరిపై నిరంతర నిఘా ఉంటుందని తహసీల్దార్ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు



గజపతినగరం బాలుర హైస్కూల్‌లో 3వ తరగతిలో చేరుతున్న విద్యార్థినులకు అడ్మిషన్ పత్రాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

గజపతినగరం: స్థానిక బాలుర, బాలికోన్నత పాఠశాలల్లో 6వతరగతి, 3వ తరగతిలో ప్రవేశాలకు పలువురు విద్యార్థులకు సీఆర్పీ రామసూరిరెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శనివారం ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు కల్పించారు. ఈసందర్భంగా సీఆర్పీ రామసూరిరెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు ఉన్నాయన్నారు. నాణ్యమైన విద్యాబోధనతో పాటు మధ్యాహ్న భోజన సదుపాయం ఉందని చెప్పారు. గజపతినగరం,పురిటిపెంట న్యూకాలనీ పరిసర ప్రాంతాల్లో ఉన్న వివిధ పాఠశాలల నుంచి 95 మంది విద్యార్థులు బాలుర, బాలికోన్నత పాఠశాలల్లో శనివారం నాటికి చేరారని పేర్కొన్నారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం బస్సుయాత్రకు ఏర్పాట్లు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు అప్పలనాయుడు, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని పాతకొప్పెర్ల సమీపంలో జాతీయ రహదారిపై ఈనెల 23వ తేదీ సాయంత్రం 4 గంటలకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్వహించనున్న సిద్ధం బస్సుయాత్రకు సంబంధించిన ఏర్పాట్లను వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, తదితరులు శనివారం సాయంత్రం పరిశీలించారు. సభకు ఎంతమంది హాజరుకావచ్చు.. వాహనాల పార్కింగ్.. ట్రాఫిక్ మొదలగు అంశాలపై చర్చించి జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులోని స్థలాన్ని పరిశీలించారు. ఆయనతో పాటు వైస్ ఎంపీపీలు అల్లాడ రమేష్, ఎన్. సత్యనారాయణరాజు, ప్రజాప్రతినిధిలు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్ధనరావు, పుప్పాల లక్ష్మీనారాయణ, లంకలపల్లి రాజారావు, బొల్లు రమేష్, కోట్ల రఘు, బావిశెట్టి నారాయణరావు, కొత్తకోట శ్రీరాములు, పతివాడ సూరిబాబు, జనపాల అప్పారావు, తదితరులు ఉన్నారు.

సీఎం జగన్‌తోనే మరింత సంక్షేమం



వేపాడలో ఇంటింట ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వేపాడ: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోనే గ్రామాల మరింత అభివృద్ధి చెందుతాయని, ప్రజలకు సంక్షేమం అందుతుందని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు అన్నారు. నాయకులు రెండు బృందాలుగా ఏర్పడి మండల కేంద్రం వేపాడలో శనివారం రాత్రి ఇంటింట ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరించి సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. మే13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ఎస్.కోట ఎమ్మెల్యే అభ్యర్థి కడుబండి శ్రీనివాసరావును, విశాఖపట్నం ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ముమ్మలూరి జగ్గుబాబు, డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు, ఎంపీపీ సత్యవంతుడు, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, ఏఎంసీ చైర్‌పర్సన్, పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు మూకల కస్తూరి , వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు ఉగ్గిన శ్రీను, జేసీఎస్ మండల కన్వీనర్ బోజంకి శ్రీను, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ద్వారపూడి గంగునాయుడు స్థానిక నాయకులు ఆదపురెడ్డి ముత్యాలునాయుడు, నిరుజోగి శ్రీను, వంటాకు భాస్కర్. కిశోర్, చంద్రరావు, అప్పారావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే అగ్నిప్రమాదాల నివారణ



శృంగవరపుకోట: మాట్లాడుతున్న ఫైర్ ఆఫీసర్ షేక్ మదీనా



గజపతినగరం: మంటలను అదుపు చేసేందుకు వినియోగించే పరికరాల పనితీరును వివరిస్తున్న ఎస్ఎఫ్ఓ రవిప్రసాద్

శృంగవరపుకోట: అప్రమత్తత, అవగాహనతోనే అగ్నిప్రమాదాలను నివారించవచ్చని ఎస్.కోట అగ్నిమాపక శాఖాధికారి షేక్ మదీనా అన్నారు.అగ్ని మాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా ఫైర్‌సేఫ్టీపై స్థానిక అగ్నిమాపక కేంద్రం కార్యాలయ ఆవరణలో శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈసందర్భంగా హాజరైన స్థానికులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు సంభవించడానికి గల కారణాలు, నివారణ చర్యలు, నిరోధించే మార్గాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రమాదాలపై అవగాహన ఉంటే నివారణ సాధ్యమవుతుందని చెప్పారు.

గజపతినగరంలో..

గజపతినగరం: అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక అగ్నిమాపక కేంద్రంలో ఫైర్ ఆఫీసర్ ఎం.ఎస్.వి.రవిప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. అగ్నిప్రమాదాల సమయంలో మంటలను అదుపు చేసేందుకు వినియోగించే పరికరాలు, రసాయనాలను ప్రదర్శించారు. ఫైర్ ఆఫీసర్ రవిప్రసాద్ మాట్లాడుతూ అప్రమత్తంగా ఉంటూ, జాగ్రత్తలు పాటిస్తే అగ్నిప్రమాదాలను నివారించవచ్చని చెప్పారు. ప్రమాదాల్లో గాయపడే వారికి అందించే ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు. అగ్నిమాపకశాఖ, గ్యాస్ గొడౌన్, పెట్రోల్ బంకులు, సినిమాహాల్ సిబ్బంది పాల్గొన్నారు.

సాఫీగా ప్రయాణం



గోల్డ్‌స్టార్ జంక్షన్ నుంచి కళ్లేపల్లికి నిర్మించిన బీటీ రోడ్డు



పోతంపేట రోడ్డు



రొంగళివానిపాలెం రోడ్డు

లక్కవరపుకోట: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మండలంలోని గ్రామాల రోడ్ల రూపురేఖలు మారాయి. అధ్వానంగా ఉన్న రోడ్లను బాగు చేయాలని కాని, కొత్తగా రోడ్లు వేయాలనే ఆలోచన కాని 2019కు ముందు ఉన్న టీడీపీ పాలకులు చేయలేదు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్ల అభివృద్ధిపై పాలకులు దృష్టిసారించారు. తారు రోడ్ల పునరుద్ధరణతో పాటు పలు గ్రామాల గ్రావెల్ రోడ్లను తారురోడ్లుగా అభివృద్ధి చేశారు. మండలంలోని తామరాపల్లి నుంచి కోన మసివానిపాలెం వరకు ఉన్న 2.6 కిలోమీటర్ల గ్రావెల్ రోడ్డు రూ.1.43 కోట్లతో తారురోడ్డుగా అభివృద్ధి చేశారు. రూ.4 కోట్లతో గోల్డ్‌స్టార్ జంక్షన్ నుంచి శ్రీరాంపురం మీదుగా కళ్లేపల్లి వరకు 4.8 కిలోమీటర్లు, రూ.1.11కోట్లతో పోతంపేటకు 2 కిలోమీటర్లు, కుద్దువలసకు రూ.59 లక్షలతో 1.2 కిలోమీటర్లు, రూ.86.75 లక్షలతో రొంగళివానిపాలెంకు 1.1 కిలో మీటర్ల మేర తారు రోడ్లను నిర్మించారు. ఈ పనులను 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రా రంభించి 2021నాటికి పూర్తి చేశారు. గతంలో పెద్ద పెద్ద గోతులతో, రాళ్లు తేలి అధ్వానంగా ఉన్న దారుల్లో రాకపోకలు సాగించేందు కు నానా అవస్థలు పడాల్సి వచ్చేదని, ప్రస్తుతం ప్రయాణం సాఫీగా సాగిపోతోందని, ఆ మార్గంలో ప్రయాణించే వారు, వాహన చోదకులు చెబుతున్నారు.



కోనమసివానిపాలెం-తామరాపల్లి రోడ్డు

అభివృద్ధిపథంలో విజయరాంపురం



రూ. 15 లక్షలతో అభివృద్ధి చేసిన ప్రభుత్వ పాఠశాల



దేవదాయశాఖ నిధులు రూ.10 లక్షలతో నిర్మిస్తున్న రామాలయం



ఇటీవల నిర్మించిన రోడ్డు



వైఎస్సార్‌సీపీ హయాంలో నిర్మించిన కాలువలు

చీపురుపల్లిరూరల్ (గరివిడి): గరివిడి మండలంలోని వీపీ రేగ పంచాయతీ పరిధి విజయరాంపురంలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక లక్షలాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టారు. సుమారు 50 లక్షల రూపాయలతో రోడ్లు, కల్వర్టులు, రామాలయం, పాఠశాలల్లో అభివృద్ధి పనులు జరిగాయి. గ్రామంలోని ప్రధాన రహదారి అధ్వానంగా మారడంతో సర్పంచ్ పాసి రాము ఆధ్వర్యంలో ఆరు లక్షల రూపాయలతో సీసీ రోడ్డు నిర్మించారు. అలాగే మరో రెండు వీధుల్లో ఐదు లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్లు వేశారు. మరో మూడు లక్షల రూపాయలతో కాలువ నిర్మాణ పనులు చేపట్టారు. గ్రామ ప్రధాన రహదారిలో రూ. 3 లక్షలతో కల్వర్టు నిర్మాణం పూర్తి చేశారు. అదేవిధంగా సచివాలయం నిధులు 2.5 లక్షల రూపాయలతో గ్రామానికి చెందిన తుమ్మకబంద నుంచి పొలాల్లోకి నీరు పోయేందుకు కాలువ ఏర్పాటు చేశారు. శ్మశానవాటికలో మండల పరిషత్ నిధులు లక్ష రూపాయలతో బోరుతీయించారు. వివిధ అభివృద్ధి పనులతో పాటు రూ. 10 లక్షలతో రామాలయం నిర్మిస్తున్నారు. అలాగే నాడు – నేడు కార్యక్రమంలో భాగంగా రూ. 15 లక్షలతో పాఠశాలలో బాత్‌రూమ్‌లు, ప్రహరీ, ఇతర అభివృద్ధి పనులు చేపట్టారు. ఐదేళ్ల కాలంలో గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసినందుకు గ్రామస్తులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

బొత్స సందీప్ నామినేషన్



ఆర్డీఓకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న బొత్స సందీప్

చీపురుపల్లి: విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ కుమారుడు డాక్టర్ బొత్స సందీప్ ఎమ్మెల్యే అభ్యర్థిగా శనివారం నామినేషన్ దాఖలు చేశారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో తన నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారి, ఆర్డీఓ బి. శాంతికి అందజేశారు.

ఆకట్టుకున్న నృత్య రూపకం



విద్యార్థులు ప్రదర్శిస్తున్న నృత్య రూపకం

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన రామనారాయణంలో త్రివేణి నృత్య కళా డ్యాన్స్ అకాడమీ డైరెక్టర్ హారిక ఆధ్వర్యంలో విద్యార్థులు శనివారం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆహూతులను అలరించింది. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వాహకులు ధ్రువపత్రాలు అందజేశారు.

అభివృద్ధి, సంక్షేమం చూసి ఆశీర్వదించండి



రామలింగాపురంలో వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కడుబండి



ఎమ్మెల్యే కడుబండికి హారతులుపడుతున్న మహిళలు

కొత్తవలస: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ ఐదేళ్లు పాలన సాగించారని, ప్రతి ఇంటికీ జరిగిన సంక్షేమం, గ్రామాల అభివృద్ధిని గుర్తించి మరోమారు జగన్‌ను ప్రజలంతా ఆశీర్వదించాలని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు కోరారు. మండలంలోని రామలిం గాపురం గ్రామంలో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబుతో కలిసి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలు ఎమ్మెల్యేకు తిలకం దిద్ది, హారతులు పట్టి స్వాగతం పలికారు. నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. సీఎం జగన్ తోనే రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని అన్నారు. అవినీతి రహిత సంక్షేమ పాలన అందించామని, వివక్ష లేకుండా అర్హులందరికీ పథకాలు అందజేశామని చెప్పారు. వెలమకార్పొరేషన్ చైర్మన్ నాయుడుబాబు మాట్లాడుతూ ఎస్.కోట నియోజకవర్గం అభివృద్ధికి ఎమ్మెల్యే శ్రీనివాసరావు ఐదేళ్లలో చేసిన కృషిని ప్రజలు గుర్తించాలని కోరారు. పేదల అభ్యున్నతే ధ్యేయంగా అన్ని వర్గాలకు అండగా నిలుస్తూ సంక్షేమపాలన అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. గత పాలకులు నిర్లక్ష్యం వల్ల గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడ్డాయని అన్నారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ఎస్.కోట ఎమ్మెల్యే అభ్యర్థి కడుబండి శ్రీనివాసరావును, విశాఖపట్నం ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిని అధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. జెడ్పీటీసీ నెక్కల శ్రీదేవి,ఎంపీపీ నీలంశెట్టి గోపమ్మ,స్థానిక సర్పంచ్ నెక్కల గౌరినాయుడు, ఎంపీటీసీ లెంక వరహాలు, పార్టీ మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి బొంతల వెంకటరమణ, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.